విజయార్కె

# థాంక్యూ సజని



''హేవండీ..'' గోముగా పిలిచింది సజని తన భార్య విజయ్‌ని.

'ఏంటీ... మళ్ళా మూడొస్తోందా? బందరులడ్డులా వున్న భార్యని మీదికి లాక్కొని చిలిపిగా అడిగాడు విజయ్.

''ఇదిగో... ఈ రొమాంటిక్ వేషాలే వద్దనేది...'' అంది ముద్దుగా మొగుడ్ని విసుక్కుంటూ సజని.

''మరి.. అర్ధరాత్రి... వెన్నెల వేళ... పెళ్ళయిన కొత్త జంట... ముద్దుల భార్య భర్త గుండెలమీద తల పెట్టి... హేవండీ'' అంటే ఏమని అర్థం...'' బాసుందీ బావుంది మరోటి తింటారా? అని అర్థమా? వళ్లు మండి అడిగాడు విజయ్.

''ఇలా అయితే నేను చెప్పనంతే...'' బుంగమూతి పెట్టి అంది భర్త నుంచి దూరంగా జరుగుతూ సజని.

''అబ్బ... నీతో వచ్చిన చిక్కే ఇది... ఈ మాత్రానికి అలా దూరంగా జరగాలా? భార్య టచ్చింగ్ దూరమవ్వడంతో ఫీలయి అన్నాడు.

''మరి నేను చెప్పేది సీరియస్‌గా వింటారా?''

''వింటాను''

''కోప్పడకూడదు''

''కోప్పడను''

''సీరియస్సవ్వకూడదు''

''అవ్వను''

''ప్రామిస్''

''కోల్గెట్'' వళ్ళు మండి అన్నాడు విజయ్.

''అదిగో మీరు సీరియస్సవుతున్నారు'' అంది మళ్లా బుంగమూతి పెట్టి.

''హిహ్హిహ్హి'' అని నవ్వి సరే... ఇప్పుడు చెప్పు...

ఆగాగు... ఆ దిక్కుమాలిన వక్కపొడి మానలేకపోతున్నాను. హోటల్‌లో ఆడ రౌడిలా సోంపు తినకుండా వుండడం కష్టమవు తుందని గానీ అనవుగా'' భయంగా అడిగాడు విజయ్.

''మీరు మరీ చిలిపి.. అదేం కాదు''

''హమ్మయ్య... అయితే ఇప్పుడు చెప్పు''

''నేను సన్మానం చేయించుకుంటానండీ...''

పోఖ్రాన్‌లో పేలాల్సిన పేలుడు తన గుండెలో పేలిన ఎక్స్‌ప్రెషనిచ్చాడు విజయ్.

''నువ్వు.. నువ్వు సన్మానం చేయించుకుంటావా?''

''ఏమ్మా... పక్కింటి సుబ్బాయమ్మకు వంకాయ కూర బాగా వండుతుందని సన్మానం చేశారు. ఎదురింటి వెంకటలక్ష్మికి అప్పుడెప్పుడో ప్రతీ శనివారం ముష్టివాళ్ళకు పావలా, అర్ధ దానం చేస్తుందని 'దానరత్న' బిరుదు ఇచ్చి సన్మానం చేశారు. మా ఫ్రెండు పాపాయమ్మ పత్రికలకు పంపించిన కథలు పాతిక తిరిగొచ్చిన సందర్భంగా సన్మానం చేయించుకుంది.

''వాళ్ళంతా సన్మానం చేయించుకోగా లేనిది, నేను సన్మానం చేయించుకుంటే తప్పా?'' అంతేలెండి... పెళ్ళి కాక ముందు... సజనీ... మై లవ్... మై ప్యార్... మై బందరు లడ్డు... మై దూద్ పేడా... కాకరపీసు అని నా వెంట పడ్డారు. ఇప్పుడేమో... ఇలా...'' అంటూ ముక్కు చీది ఓ ఏడుపు ఎక్స్‌ప్రెషనిచ్చింది సజని.

విజయ్ బిత్తరపోయేడు.

భార్యంటే వల్లమాలిన ప్రేమ. సజని రచయిత్రి కూడా. ఏ మాటకామాటే చెప్పుకోవాలంటే, బాగానే రాస్తుంది. తనకి సరైన ప్రోత్సాహం లేక, అలా మరుగున పడింది. దానికితోడు ఇంటిపని... భర్త పని...

భర్తకు కావాల్సినవన్నీ సజనే సమకూరుస్తుంది. తన భర్తకు సంబంధించిన ప్రతీ పని తనే చేయాలంటుంది. అతని బట్టలు ఐరన్ చేయటం, షూ పాలిష్ చేయడం వరకూ.... ఆమెకున్న ఒకే ఒక వీక్‌నెస్ సన్మానాలు అని పెళ్ళికి ముందు విన్నాడు.

''నీకీ సన్మానాల పిచ్చేమిటి? నెత్తినోరూ బాదుకొని అన్నాడు విజయ్.

''సన్మానం చేయించుకోవాలంటే ఓ అర్హత వుండాలి.. సన్మానం చేసే సంస్థకు కూడా... ప్రతిష్టాత్మకమైన సంస్థ, ప్రతిష్టాత్మకమైన అవార్డుతో నిన్ను సత్కరిస్తే అది నీకే పేరు.

రైటర్‌గా ఇంకా కృషి చేయి. నెంబర్ వన్ రైటర్‌గా పేరు తెచ్చుకో. కేంద్ర సాహిత్య అకాడెమీ లాంటి అవార్డు లాంటిది కూడా రావచ్చు. అంతేకాని వీధికో సన్మాన సంస్థ వుంది కదా అని... సన్మానం చేయించుకోవద్దు'' శ్రీకృష్ణపరమాత్మ లెవల్లో హితబోధ చేయబోయేడు.

అంతే, మూడంకె వేసి ''నో ముద్దులు.. నో ముచ్చట్లు..'' అంది. భార్యంటే ప్రేమున్న విజయ్ సరే... కానీ నీకింత సడన్‌గా ఇలాంటి ఆలోచన ఎందుకొచ్చిందే? అడిగాడు మొగుడు.

''ఇవ్వాళ ఉదయం గొళ్ళెల సన్మానం సంస్థ అధ్యక్షుడు వచ్చాడు'' చెప్పింది ఉత్సాహంగా సజని.

''గొళ్ళెం సంస్థా?''

''అవును... అతని పేరు ఖడ్గం కనకారావు, ఉదయం వచ్చి.... అంటూ తన్మయత్వంగా కళ్లు మూసుకుని ఉదయం జరిగిన సంఘటన గుర్తు చేసుకోసాగింది.

★★★

ట్రింగ్ ట్రింగ్‌మని కాలింగ్ బెల్ శబ్దం వినిపించింది.

''ఆవగింజలను పోపు డబ్బాలో ఎలా సర్దాలో'' అన్న వ్యాసం రాస్తున్న సజని లేచి వెళ్లి తలుపు తీసింది.

పాతికేళ్ళ యువకుడు 'హిహిహి' నవ్వాడు తలుపు తీయగానే.

వచ్చిన శాల్తీ ఎవరో అర్థంగాకపోయినా అతను పళ్ళికిలించి హిహిహి అని నవ్వాడని తనూ నవ్వింది.

అతను మొహమాటానికి మరోసారి నవ్వాడు.

సజని కూడా నవ్వి ఇక నవ్వే ఓపిక లేక లోపలికి రండి అని ఆహ్వానించింది.

''నా పేరు ఖడ్గం కనకారావండీ... గొళ్ళెం కళా సంస్థ అధ్యక్షుడ్ని'' అన్నాడతను. నిజానికి ఆ సంస్థకు అధ్యక్షుడు, కార్యదర్శి నుంచి క్లర్క్ వరకూ అతనే.

అలాగా అన్నట్టు చూసింది.

''మీ జోకులు నాలుగైదు ఫలానా పత్రికలో, మీ ఆర్టికల్స్ రెండు మూడు గిలానా పత్రికలో, ఓ కథ ఇంకో పత్రికలో చూసానండీ... వెంటనే పనిగట్టుకుని వచ్చానండీ... అన్నాడు.

''అలాగా... థ్యాంక్స్ అంది'' సజని. అతడ్ని తన అభిమాని కాబోలు అనుకొని పొంగిపోతూ.

''ఇది చాలా అన్యాయమండీ...'' అన్నాడతను ఒకేసారి.

''ఏది... నేను మీకు థ్యాంక్స్ చెప్పడమా? అయోమయంగా అడిగింది సజని.

''ఛ..ఛ అది కాదండీ... ఇన్ని జోకులు, ఆర్టికల్స్ ఓ కథ రాసి కూడా మీరు సన్మానం చేయించుకోకపోవడం'' అన్నాడతను గుడ్లు మిటకరిస్తూ ఆశగా సజని హ్యాండ్ బ్యాగ్ వంక చూస్తూ.

''స..న్మా..న..మా? నా...కా''? సజని కళ్ళు మెరిసాయి. చిన్నప్పట్నుంచి 'సన్మానం' అంటే ఇష్టం సజనికి. పత్రికల్లో కల్చరల్ కాలమ్‌లో ఫలానా సన్మాన సంస్థ, ఫలానా వ్యక్తికి సన్మానం చేసిందన్న వార్త చదవగానే తనకే జరిగినట్టు పొంగిపోయేది.

తనను వేదికమీదికి పిలవడం... తన గురించి పొగడ్డం.. దండ వేయడం.. శాలువా కప్పడం... మెమెంటో ఇవ్వడం... ఆహూతులు చప్పట్లు కొట్టడం... పత్రికలో వార్త... ఫొటోలు.. అబ్బో అని పొంగిపోయేది.

తను కూడా ఎప్పటికైనా సన్మానం చేయించుకోవాలనే పట్టుదల పెంచుకుంది. అదలా డెవలప్ చేసుకుంది.

''మీకేం తక్కువండీ... ఫ్రంట్ నుంచి చూస్తే శోభాడే కనిపిస్తోంది. సైడ్ నుంచి చూస్తే అరుంధతీ రాయ్ కనిపిస్తోంది... మీకింకా సన్మానం జరగకపోవడం జంటనగరాల

సన్మాన సంస్థలకే అవమానం' అన్నాడు ఎమోషనల్ ఎక్స్‌ప్రెషనిస్తూ.

''అంటే నాకు సన్మానం చేస్తారా?

''తప్పకుండా.. ఎటొచ్చీ.... ఇన్విటేషన్ కార్డులో మీ పేరు వేయాలి. ఇన్విటేషన్ కార్డ్సుకు ఓ రెండొందలు ఖర్చు అంతే...''

''సరే... అంది' సజని.

''మీకు మామూలు దండ కావాలా? పుదీనా మాల కావాలా?''

''అదేంటి?'

''అదంతే మేడమ్... ఇపుడు పుదీనా మాల స్పెషల్.. దానికో రెండొందలు... ఇంటికొచ్చాక ఆ పుదీనాతో పచ్చడి కూడా చేసుకోవచ్చు. లేదంటే... సన్మానం అయ్యాక రిటర్న్ చేస్తే ఫిఫ్టీ పర్సెంట్ డిస్కౌంట్. మీకు వంద తిరిగిస్తాం..

''అలాగలాగే''

''ఇకపోతే..

''ఎవరు నేనా?'' అయోమయంగా అడిగింది సజని.

''అబ్బా... మీరు మరీ కామెడీ చేస్తారు. ఈ రీజన్‌తో కూడా మీకు కామెడీరత్న బిరుదు ఇవ్వచ్చు... అన్నట్టు షీల్డ్‌కు ఓ రెండొందలు ఖర్చవుతాయి. శాలువా కప్పి వెంటనే సన్మానం అయ్యాక వాపసు ఇచ్చేస్తే 'అద్దె'కు ఓ పాతిక, లేదా కొనాలంటే మంచిదైతే రెండొందలు... మీ సన్మానం ఫొటోలు కాపీకి పాతిక... ఇంతేనండీ... ఇక ఈ దెబ్బతో మీ సన్మానం వార్త పేపర్లలో పడి మీ కీర్తి ప్రతిష్టలు ఎక్కడికో వెళ్ళిపోతాయి..'' సీలింగ్ ఫ్యాన్ వంక చూస్తూ చెప్పాడు ఖడ్గం కనకారావు.

★★★

''అదండీ జరిగింది... అందుకే నేను సన్మానం చేయించుకుంటా. దాంతో నా పేరు మార్మోగిపోతుంది'' అంది.

భార్యను నొప్పించడం ఇష్టం లేక అలానే అన్నాడు.

తథాస్తు దేవతలు 'మీ ఖర్మ' అని ఆశీర్వదించారు చిటపటలాడిపోతూ!

★★★

అది మొదలు తొక్కల పీకేశ్వర్రావ్, గుత్పల దురదరాజా లాంటి సన్మాన సంస్థల వాళ్ళు సజని ఇంటి ముందు క్యూ కట్టారు.

''సజనీ... నా మాట వినవే.. నీ వీక్నెస్ కనిపెట్టి వాళ్ళు నిన్ను ట్రాప్ చేస్తున్నారని చెప్పినా విన్లేదు.''

దీనికి తోడు రోజూ ఓ నలుగురైదుగురు పొద్దున్నే మగాళ్లు ఆఫీసుకెళ్ళాక వీధిలోకి వచ్చి ''సన్మానాలు చేస్తాం.. సన్మానాలుచేస్తాం..'' అని అరుస్తూ తిరగడం మొదలెట్టారు.

కొందరైతే బిందెలకు,, బక్కెట్లకు మాట్లు వేసేవాళ్ళేమోనని పొరపడ్డారు.

సన్మానాలు చేస్తామని వీధిలో అరుపు వినిపిస్తే చాలు.. చేస్తోన్న పని ఆపి వాళ్ళని లోపలికి పిలిచి, వాళ్ళతో బేరమాడి డబ్బుల్లేకపోతే తన పట్టుచీరెలు తాకట్టు పెట్టి మరీ సన్మానం చేయించుకుంటోంది సజని.

రాయడం మీద కాన్సన్‌ట్రేషన్ తగ్గించింది. వాళ్ళ ఓన్లీ డాటర్ బుల్లి సజని కూడా తల్లి వాలకం చూసి బిత్తరపోతోంది. జాలిగా తల్లి వంక చూసింది ''నువ్వెప్పుడు బాగుపడతావే తల్లీ'' అన్నట్టు!

★★★

ఓ రోజు విజయ్ చౌరస్తా మీదుగా కారులో వెళ్తూ... లెఫ్ట్‌సైడ్ ముదనష్టం కళానిలయం వద్ద జనం గుమిగూడ్డం చూసి ఆసక్తిగా తనూ కారు దిగి ఏమిటా అని చూడసాగాడు.

ఓ మూడేళ్ళ పాప పిట్టగోడ మీద నిలబడి అటూ ఇటూ బుల్లి బుల్లి అడుగులేస్తోంది. జనం చప్పట్లుకొడుతున్నారు.

తనూ సంతోషంతో చప్పట్లు చరిచి, ఓ యాభై రూపాయలు ఆ పాపకు ఇవ్వాలనుకున్నాడు. క్లాస్ గారడీ పాపలా వుందనుకున్నాడు.

సరిగ్గా అప్పుడే అతని మోకాలిలో వున్న మెదడు తలకాయలోకి షిఫ్టయింది.

''ఈ పాపను ఎక్కడో చూసినట్టుందే? అనుకున్నాడు. ఎక్కడా? పక్కింటి పాపా? ఎదురింటి పాపా? పోనీ తనింటి.... అంతే... అతని గుండె గుభేలుమంది.

తన డాటర్ బుల్లి సజని... పట్టు లంగాతో ముద్దుగా బొద్దుగా ముద్దొచ్చేలా వున్న తన పాప ఇలా పిట్టగోడ మీద గారడీ చేస్తూ...

వెంటనే జనాన్ని చీల్చుకొని పిట్టగోడ దగ్గరికి పరుగెత్తాడు.

'ఏయ్... ఆగవోయ్...పాప చక్కగా ఫీట్లు చేస్తుంటే ఎక్కడికెళ్తావ్? ఎవరో కసిరారు.

''ఛా... మీ యబ్బ... మిమ్మల్ని నా కారు కింద తొక్కేయ... అది నా కూతుర్రా... '' అని అరిచి పిట్టగోడ దగ్గరికి వెళ్ళి తన బుల్లి సజనిని గుండెలకు హత్తుకొని....

''ఏంటమ్మా... ఇలా గారడీ చేస్తున్నావు... చాక్లెట్స్‌కు డబ్బులు కావాలా?'' అని అడిగాడు.

బుల్లి సజని ఎదురుగా చిన్ని చేతులు పెట్టి చూపించింది. పెద్ద బ్యానర్ 'తొక్కల పీకేశ్వర్రావ్, గుత్పల దురదరాజా, గొళ్ళాల సంస్థలు సంయుక్తంగా సజనికి చేస్తున్న సన్మానం'' అని వుంది ఆ బ్యానర్ మీద.

''సార్...ఓ మేడమ్ వచ్చి, పాపను పిట్టగోడ మీద కూచోబెట్టి, పాపను చూస్తూ వుండు'' అని ఓ పది రూపాయలు నా చేతిలో పెట్టి వెళ్ళింది'' ఎంత ఐదు నిమిషాల్లో శాలువా కప్పించుకొని వస్తుందార్'' మీ పాప కూడా వుందా? అని ఆశగా అడిగాడు.

''స...జ...నీ... అని గట్టిగా ఓ కేకవేశాడు.

లోపల ముదనష్టపు కళానిలయంలో శాలువా కప్పించుకుంటోన్న సజని వీపు అదిరింది. సన్మాన సంస్థల అధ్యక్షులకు ఎడమ కన్ను అదిరింది.

మళ్ళీ తథాస్తు దేవతల వాళ్ళ వంక చూసి 'అయిపోయార్రా..' అని అనుకున్నారు.

★★★

కారులో విజయ్ ఇంటికొచ్చేసరికి, తన ఇంటి ముందు గుత్పల దురదరాజా, తొక్కల పీకేశ్వర్రావ్, ఖడ్గం కనకారావులు కుంటికాలుతో తొక్కుడు బిళ్ళ ఆట ఆడుతూ ''సన్మానాలు చేస్తాం... హిహిహి ... సన్మానాలు చేస్తాం'' అంటూ పిచ్చిగా అరుస్తున్నారు. వాళ్ల మోకాళ్ళకు బ్యాండేజి కట్లు వున్నాయి.

భయంగా లోపలికి పరుగెత్తాడు విజయ్. నిన్న పాపను పిట్టగోడ మీద వదిలినందుకు తను సజన్ని చెడామడా తిట్టాడు. మళ్ళా వీళ్ళని చూస్తే టెంప్టయిపోతుందని భయంతో పరుగెత్తాడు.

లోపలికి వెళ్ళేసరికి సజని బుద్ధిగా ఏదో స్క్రిప్ట్ రాసుకుంటోంది. పక్కనే బుల్లి సజని ఆడుకుంటుంది.

''సజనీ... సజనీ డాళింగ్... ఇది కలా? నిజమా? రోజూ పొద్దున్నే ఎగేసుకుని సన్మానాలకు వెళ్ళి ఏ అర్ధరాత్రో ఇంటికి వచ్చే నువ్వు....

''నన్ను క్షమించండి... నాకు బుద్దొచ్చింది. నిన్న మీరు తిట్టాక కోపంగా ట్యాంక్‌బండ్‌లోకి దూకుదామని వెళ్ళా... అక్కడ గుత్పల దురదరాజా, తొక్కల పీకేశ్వర్రావ్, ఖడ్గం కనకారావులు నా గురించి మాట్లాడుకోవడం విన్నాను.

''నేనో బక్రానట. నాకు సన్మానాల పిచ్చి వుందని ట్విన్ సిటీస్‌లో సన్మాన సంస్థల వాళ్ళకంతా తెలుసట. పిచ్చిది... సన్మానం అనగానే ఎగేసుకుని వస్తుంది. మనకు డబ్బులొస్తున్నాయ్'' అని చెప్పుకుని నవ్వుకుంటున్నారు.

రాత్రంతా ఆలోచించాను. నిజమే నా బలహీనతను వాళ్లు సొమ్ము చేసుకుంటున్నారు. నా ప్రతిభను పాఠకులు గుర్తించాలి. ఇలా డబ్బు తీసుకొని 'అడ్డమైన బిరుదులు' ఇచ్చేవాళ్లు కాదని అర్థమైంది.

అందుకే ఇవ్వాళ ఉదయం ....వాళ్ళని పిలిచి, బాల్కనీలో నుంచి వాళ్ళ మోకాళ్లు పగిలేలా పూలకుండీలు విసిరాను. వెంటనే మోకాళ్లలో వున్న వాళ్ళ మెదళ్లు చితికి, పిచ్చెక్కిపోయారు. ఛస్తే ఇక సన్మానం చేస్తామని నా లాంటి అమాయకుల వెంట పడరు..''

నేను బుద్ధిగా, కథలు, నవలలు రాసుకుంటాను. రచయిత్రిగా పేరు తెచ్చుకుంటాను. నేను, మీరూ, మన బుల్లి సజని రచయిత్రిగా పాఠకుల్లో పేరు.. ఇవి చాలు...'' అంది భర్త గుండెల్లో ఒదిగిపోతూ.

తథాస్తు దేవతలు ఆనందంగా తథాస్తు అన్నారు.

★★★

అన్నట్టుగానే సజని చేసిన కృషి, పట్టుదల ఫలించాయి. నెంబర్ వన్ రచయిత్రి అయింది సజని!

సన్మానాల పేరుతో... మనుష్యుల బలహీనతలతో ఆడుకునే వాళ్ళకు కనువిప్పు కలిగించడానికి ''థ్యాంక్యూ సజని!''పేరుతో తన అనుభవాన్నే ఓ కథగా రాసి పంపించింది.

★

